క్లుప్తంగా

కాళికాంబకు ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, వివిధ రకాల పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టి పుష్పాభిషేకం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేయించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాశీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నంద్యాల వైద్యులకు ఐఎంఏ జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ మధుసూదనరావు

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఈఎన్‌టీ డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఐఎంఏ 99వ జాతీయ మహాసభల్లో జాతీయ పురస్కారాలను అందుకున్నారు. వారు మాట్లాడుతూ సామాజిక సేవలకు డాక్టర్ జ్యోతి ప్రసాద్ గంగూళి జాతీయ పురస్కారం అందుకున్నామని, డాక్టర్ మధుసూదనరావు చేసిన వైద్య సేవలకు గుర్తింపుగా ఐఎంఏ జాతీయ జీవిత కాల సాధన పురస్కారం అందుకున్నారని చెప్పారు. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్, నూతన అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బాన్షలీ పురస్కారాలు అందించి సత్కరించారన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



గ్రామ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభద్ర

దొర్నిపాడు: మండలంలోని ఉమాపతినగరం గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా అది కాస్త వివాదంగా మారింది. గ్రామానికి చెందిన చిన్నపుల్లయ్య తనతో పాటు జానకిరామయ్యకు మాత్రమే ఇక్కడ రస్తా ఉందని, నారాయణ, మురళీకృష్ణ పొలం, ఇంటికి రస్తా లేకున్నా అక్రమంగా ప్రవేశిస్తున్నారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.దీంతో తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి, సర్వేయరు నాగప్రసాద్ శుక్రవారం గ్రామానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడి రస్తా విస్తీర్ణం, హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీంతో ఇరువురు ఒప్పందాలు చేసుకోని సీసీ రోడ్డు వేసేందుకు అంగీకరించారు.

అలరించిన విద్యార్థుల కవి సమ్మేళనం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మండలంలోని అయ్యలూరు ఉర్దూ పాఠశాలలో ప్రముఖ ఉర్దూ కవి మీర్జా గాలిబ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అబ్దుల్‌సత్తార్, ఉర్దూ సాహిత్య కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ సమ్మద్ హాజరై మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యంపై విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఉర్దూ కవితలు వినిపించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్, రోటరీ ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కె మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి విద్యార్థులకు వివరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు విజయకుమారి, వసుంధరాదేవి, విజయలక్ష్మి, రేణుక, ప్రసాద్ పాల్గొన్నారు.

‘బాదుడు’పై భగ్గు

- కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన



ఆళ్లగడ్డలో నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంగుల, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆళ్లగడ్డ: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ భగ్గుమంది. తాము అధికారంలోకి వస్తే.. అధికారంలో ఉన్నన్ని రోజులు విద్యుత్ చార్జీలు పెంచం.. వీలైతే తగ్గిస్తాం అని చెప్పిన చంద్రబాబునాయుడు ఆరు నెలల్లోనే ఎడాపెడా వినియోగదారులను బాదేస్తున్న తీరుపై రోడ్డెక్కింది. నియోజకవర్గ విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించింది. తక్షణం పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ శాఖ డీఈకి వినతిపత్రం అందించారు. పెంచిన విద్యుత్ చార్జీల బాదుడుకు నిసనగా మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలకు బాసటగా మహిళలు, రైతులు, విశ్రాంత ఉద్యోగులు ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు. స్థానిక పార్టీ కార్యలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అక్కడ విద్యుత్ కార్యాలయాన్ని దిగ్బందించి నిరసన వ్యక్తం చేశారు. గంగుల మాట్లాడుతూ అధికారంలోకి వచ్చారు రెండు విడతలుగా రూ 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రతి నెలా డైవర్ట్ చేస్తున్నారన్నారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు బాబులాల్, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వసీం, అమర్‌నాథరెడ్డి, నాయకులు సలాం, కుమార్‌రెడ్డి, బత్తుల నాగేశ్వర్‌రావు, భూమా చెంచిరెడ్డి, బుద్దా చంద్రమోహన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని మాజీ ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు.



మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి,



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల



నంద్యాలలో ర్యాలీగా విద్యుత్ కార్యాలయం వద్దకు వెళ్తున్న శిల్పారవి, పోచా, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

సృష్టించిన సంపద ఎవరి జేబుల్లోకి వెళ్తుంది?

- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

బొమ్మలసత్రం: రాష్ట్రంలో సంపద సృష్టిస్తున్నామని ఆర్భాటాలు పలికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటి వరకు సృష్టించిన సంపద ఎవరి జేబులోకి వెళ్లిందో చెప్పాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం స్థానిక సాయిబాబానగర్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు పోరుబాట పేరుతో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్ పాల్గొన్నారు. సాయిబాబా నగర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందించి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీగా విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకుని ఈఈ సుధాకర్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజల వద్దకు వెళ్లి తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచేదేలేదని నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచటమే కాకుండా ప్రజలపై రూ.15485 కోట్ల భారాన్ని మోపడం దారుణమన్నారు. మాజీ ఎంపీ పోచా మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు లేక రోడ్డెక్కాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని రైతులకు వెంటనే గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ



వైఎస్సార్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి, మాజీ ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



ఈఈ సుధాకర్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

కూటమి నేతల అబద్ధపు వాగ్దానాలతో ప్రజలు మూసపోయారన్నారు. నాయకులు పీపీ మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నాయకులు డాక్టర్ శశికళారెడ్డి, చంద్రశేఖర్, కల్లూరి రామలింగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బరాయుడు, బసవేశ్వరరెడ్డి, సాయిరాంరెడ్డి, టైలర్ శివ, విజయభాస్కర్, అమృతరాజ్, కలామ్‌బాషా, శ్రీరాములు, కృష్ణమోహన్, లక్ష్మీనారాయణ, కిరణ్, కాల్వ నాగరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు తదితర వాటిపై మూడవ పట్టణ సీఐ సూర్యమౌళి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే 100, 112 నంబర్లకు తక్షణమే ఫోన్ చేయాలన్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్ నేరగాళ్ల వలలో పడి మోసపోతే 1930 నెంబరుకు ఫోన్ చేసి దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని చెప్పారు.



మాట్లాడుతున్న సీఐ సూర్యమౌళి

ఎస్ఐ దేవేంద్రకుమార్, ప్రిన్సిపాల్ చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



గెలుపొందిన విశ్వాసపురం టీం

నంద్యాల(న్యూటౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పాస్టరేట్-1 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. మొదటి మ్యాచ్‌లో విజయపురి, బీబీజే కాంపౌండ్ పోటీ పడగా..బీబీజే కాంపౌండ్ టీం విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో విశ్వాసపురం, శ్యామనగర్ పోటీ పడగా విశ్వాసపురం గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో విశ్వాసపురం, వీసీ కాలనీ పోటీల్లో పాల్గొనగా విశ్వాసపురం గెలుపొంది ఫైనల్ మ్యాచ్‌లో విశ్వాసపురం బీబీజే కాంపౌండ్‌లో పోటీల్లో పాల్గొనగా బీబీజే కాంపౌండ్ ఓటమి చెందింది. విశ్వాసపురం జట్టు కెప్టెన్ జోసెఫ్‌కు బహుమతులు అందించారు. నిర్వాహకులు సురేష్‌పాల్, ప్రభుదాసు,ప్రదీప్ శ్యాలం రాజు, చైతన్య జయకుమార్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలి

నంద్యాల(అర్బన్): రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న 2.0 సిస్టంలో ప్రైవేట్ అటెండెన్స్ ప్రక్రియ లేక పోవడంతో వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడుతున్నారని నంద్యాల జిల్లా స్టాంపు రైటర్లు, స్టాంపు వెండర్ల సంక్షేమ సంఘం సభ్యులు ఫారుక్, రమేష్ తెలిపారు. గతంలో ఉన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలంటూ బుదవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సంఘం సభ్యులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు .

వడ్డీ లేని రుణాల మంజూరుపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి

నంద్యాల(న్యూటౌన్): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ, ఉన్నతి ద్వారా వడ్డీ లేని రుణాల మంజూరుపై శుక్రవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ఎస్సీ మహిళా సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీ దేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్యాపిలి లబ్ధిదారులతో చెప్పుల షాప్ యూనిట్, బండిఆత్మకూరు, బేతంచెర్ల లబ్ధిదారులతో మాట్లాడి పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి యూనిట్‌కు ఎస్సీ కార్పొరేషన్ నుంచి రూ.50వేలు, ఉన్నతి నుంచి వడ్డీ లేని రుణాలు రూ.40వేల నుంచి రూ.1.30లక్షల వరకు ఇస్తామని చెప్పారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రచార యాత్ర నంద్యాల జిల్లాలోని డోన్ నుంచి ప్రారంభమై బనగానపల్లె మీదుగా సాయంత్రం నంద్యాలకు చేరిందన్నారు. బొమ్మలసత్రం సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల్లో విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై చర్చిస్తామన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుజాత, ఆర్థిక కార్యదర్శి బాబా, జిల్లా కార్యదర్శులు రామ్మోహన్, కిశోర్, రామకృష్ణుడు, అరవింద్, కాశీం, రమణ, జాన్సన్, వెంకటేశ్వర్లు, తాహేర్ పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణ సమీపంలో ఉన్న నందమూరినగర్‌లో సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో శత వార్షికోత్సవాల్లో భాగంగా పతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది. హుసేన్‌సా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి, పేద ప్రజల సంక్షేమం కోసం పోరాటం నిర్వహిస్తున్న సీపీఐ పార్టీ వంద సంవత్సరాలు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. మాబాషా, ఇస్మాయిల్, నాయక్, రహిమాన్, ఆనంద్ పాల్గొన్నారు.

ఎస్సీ జనాభా వివరాలపై సోషల్ ఆడిట్

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీల జనాభా వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం, సాధికారత అధికారిణి చింతామణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కుల గణన వివరాలను ఈనెల 26న గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శనకు ఉంచామని, వీటిపై అభ్యంతరాలు ఉంటే 31లోగా సమర్పించాలన్నారు. 2025 జనవరి 6 వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని, సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న కుల గణన తుది జాబితా వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను పంపిందన్నారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్‌ఓ పరిశీలించి వివరాలను మండల ఆర్‌ఐ నుంచి తహసీల్దార్‌కు సిఫార్సు చేస్తారన్నారు. తహసీల్దార్, వీఆర్‌ఓ, ఆర్‌ఐల నివేదికల్లో వివరాలను పరిశీలించి తుది ఆమోదం తెలియజేయనున్నామన్నారు. వివరాలను త్వరలో ప్రభుత్వ పోర్టల్‌లో పొందు పరుస్తారని వివరించారు.

ఆర్థిక దార్శనికుడికి నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(అర్బన్):మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణవేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా స్థానిక శిల్పారవి నివాస గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, చాబోలు సలాం, ఊకొట్టు వాసు, ఆనందరావు, అబ్రహాం, చెన్నారెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ప్రజా సమస్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం, జిల్లా కార్యదర్శి మోహన్‌బాబు, మండల కార్యదర్శి శివనారాయణ, శివశంకర్, ఆటోనగర్ వాసు, చంద్రపాల్, సంజీవరావు, తిరుమలేష్ నివాళులర్పించారు.

చాగలమర్రి: ఆర్థిక దార్శనికుడిగా, ఆర్థిక సంస్కరణల సారథిగా పేరు గాంచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అజీం బ్రిల్లియంట్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు శ్రీనివాసులు, ముల్లా గౌసులాజం సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



చాగలమర్రి బాలుర జెడ్పీ పాఠశాలలో మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



పగిడెపాడులో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఆర్‌డీఓ

ఉయ్యాలవాడ : గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని నంద్యాల ఆర్‌డీఓ చల్లా విశ్వనాథం అన్నారు. శుక్రవారం మండలంలోని పడిగెపాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరై గ్రామసభలో మాట్లాడారు. భూ సమస్యలు ముఖ్యంగా కుటుంబ ఆస్తుల పంపకం సమయంలో, వారసత్వపు పత్రాలు రాసుకుని సాగు చేసిన భూమి రిజిస్టర్ చేయించుకోక పోవడం వంటి సమస్యలను కుటుంబ పెద్దల సమక్షంలో సామరస్యంగా పూర్వపు రోజుల్లో పరిష్కరించుకోనేవారు. నేడు ఆ దిశగా రైతులు ఆలోచన చేయడం లేదు. పూర్వపు రోజుల్లో చదువు ఎక్కువగా చదువుకునే వారు కాదని, నేడు ప్రతి ఒక్కరూ చదువుకోవడం, భూములు విలువలు పెరగడంతో తగాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో రెవెన్యూ అధికారులకు అర్జీలు అందజేసి భూముల విస్తీర్ణం కొలతలు వేయించుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ విజయలక్ష్మి, దేవదాయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, వీఆర్‌ఓలు దాదా సాహెబ్, వెంకటలక్ష్మి, గోపాల్‌నాయుడు, కూడాల నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: కోటపాడులో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తమ భూ సమస్యలను పరిష్కారించాలంటూ ముగ్గురు రైతులు అర్జీలను తహసీల్దార్ పుష్పకుమారికి అందజేశారు. సర్పంచు దూదేకుల ఉశేన్‌బీ, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్ కుమార్, సర్వేయర్ చిన్న మల్లయ్య, వీఆర్వో రసూల్, రైతులు పాల్గొన్నారు.



పడిగెపాడు వద్ద సాగు చేసిన మినుము పంట,



ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో పూత రాలిపోయిన పప్పు శనగ పంట,



దొర్నిపాడులో నేలవాలిన జొన్న పైరు

రైతుల్లో కలవరపాటు

ఉయ్యాలవాడ : అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుని శుక్రవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. మండలంలో రబీ సీజన్‌లో 12,149 హెక్టార్లలో పప్పుశనగ, 807 హెక్టార్లలో కంది , 180 హెక్టార్లలో మినుము పంటలు సాగు చేశారు. డిసెంబర్ నుంచి ఎండ లేకపోగా ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకొని రెండు రోజులకొక సారి చిరుజల్లులు కురుస్తుండటంతో పంటలు కోల్పోతామోనని రైతన్నను కలవర పెడుతోంది. చిరుజల్లులతో పూత, కాయ దశల్లో ఉన్న పంటలు పూత రాలిపోయి పంటలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. సాగు చేసిన పంటలు 60 రోజులు కాలం గడిచిపోవడంతో మరో 20 రోజులు లేదా నెలలోపు దిగుబడులు చేతికి అందే తరుణంలో నష్టాలను మూట కట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

దొర్నిపాడు: చేతికొందే దశలో ఉన్న పంటలను వర్షం ముంచేసింది. మూడురోజులుగా కరుస్తున్న తేలిక పాటి వర్షాని తోడు శుక్రవారం మోస్తరుగా వర్షం కుసింది. ఈ వర్షం శనగ, కంది, మినుము, పత్తి, జొన్న పంటలను దెబ్బతీసింది. కాగా జొన్న పైరు నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ, కందిపంటలకు పూత రాలిపోతుందని వాపోతున్నారు. దొర్నిపాడులో 7.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.